ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర

పరిగి, ఏప్రిల్ 18 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని వికారాబాద్ ఆర్డీవో ఎం.వాసుచంద్ర పేర్కొన్నారు. గురువారం పరిగిలోని తహసీల్దార్ కార్యా లయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వివరాలు నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు సంబంధించి మూడు ఎఫ్ఎస్‌టీ బృందాలు నిరంతరాయంగా పర్యటిస్తున్నాయని పేర్కొన్నారు. ఫ్లెక్సీలు, జెండాలు ఇండ్లపై పెట్టినయెడల ఇంటి యజమానులతో రాయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ఎక్కడైనా నలుగురు మించి గుమికూడరాదని అన్నారు. సభలు, ర్యాలీలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ రిటర్నింగ్ ఆఫీసవాసుచంద్ర

దోమ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సమాచార పత్రాన్ని డిస్‌ప్లే చేస్తున్న తహసీల్దార్ పురుషోత్తం

దోమ: చేవెళ్ల నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు, వాటి పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్ తదితర అంశాలతో కూడిన ఎన్నికల సమాచారాన్ని మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు 36 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల సమాచార పత్రాలను డిస్‌ప్లే చేసినట్లు తహసీల్దార్ పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన సమాచారాన్ని తెలుసుకొని పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా అందరూ సహకరించాలని ఆయన కోరారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 18 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కులకచర్ల మండల కేంద్రంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధులు రావడంలేదని, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వమే కేంద్రంలో కూడా ఉంటే రాష్ట్రానికి భారీగా నిధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ 2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అకులకచర్ల మండల ధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, వెంకటేశ్, వెంకటయ్యగౌడ్, గోపాల్‌నాయక్, బాల్‌రెడ్డి, బచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

బాధితుడు శేఖర్‌కు ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ గిరి

పెద్దేముల్, ఏప్రిల్ 18 :మండల కేంద్రానికి చెందిన గాండ్ల శేఖర్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు . ఎస్ఐ గిరి సీఈఐఆర్ ద్వారా అతడి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేసి బాధితుడికి అప్పగించారు. కార్యక్రమంలో స్టేషన్ రైటర్లు రవి, మాసయ్య పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌కుమార్

కులకచర్ల, ఏప్రిల్ 18 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సాల్వీడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌కుమార్, ప్రత్యేక అధికారి గణేశ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని సాల్వీడ్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు పనులను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ల్యాగల యాదమ్మ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆయుర్వేద వైద్యులు సంస్కృత భాషను అభ్యసించాలి'

వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 18 : ఆయుర్వేద వైద్యులందరూ సంస్కృత భాషను తప్పనిసరిగా అభ్యసించాలని సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం సూచించారు. ఆయుర్వేద చికిత్సా విధానమంతా వేల సంవత్సరాల క్రితమే సంస్కృత భాషలో రచించారని చెప్పారు. ఆ శాస్త్రాన్ని ఆంగ్లేయులు వారి భాషలోకి అనువదింపజేసుకుని, అభ్యసించి, వైద్య శాస్త్రమంతా ముందుగా తాము కనుగొన్నదేనని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని సంస్కృత అకాడమీలో 'ఆయుర్వేదం – పంచగవ్య చికిత్సా విధానం'అనే అంశంపై గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు.

వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ నీలకంఠం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారతీయ చికిత్సా విధానాన్ని, సంస్కృత భాషా అధ్యయనాన్ని ప్రోత్సహించాలని కోరారు. ప్రముఖ జర్నలిస్టు రాకా సుధాకర్‌రావు మాట్లాడుతూ సర్వశాస్త్రాలకు మూలం సంస్కృతమని అన్నారు. పంచగవ్య చికిత్సా విధానానికి సంబంధించిన సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ మురళీధరరావు, డాక్టర్ సుదర్శన్‌సింగ్, డాక్టర్ సురేఖ, రాష్ట్రపతి పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ పద్మ తదితరులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. రెండేళ్లుగా సంస్కృతం ద్వారా ఆయుర్వేదం క్లాసులు నిర్వహిస్తున్న డాక్టర్ జోషి సంతోష్‌కుమార్ ఈ వర్క్‌షాప్ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై గాంధీలో అవగాహన ర్యాలీ

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 18: ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. వడదెబ్బ లక్షణాలు, ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై గురువారం దవాఖానలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, వయోవృద్ధులు, బీపీ, షుగర్ ఉన్నవారు ఎండలు ఉన్న సమయంలో బయటకు రావొద్దని తెలిపారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు ధరించాలని, తాగునీరు వెంట తీసుకుని వెళ్లాలని, తరచుగా నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలను తాగాలని సూచించారు. ఎండదెబ్బ తగలగానే దవాఖానకు తీసుకుని వెళ్లాలని, అత్యవసర పరిస్థితిలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కుటుంబ సంక్షేమ అధికారి డి.వెంకటరామ నర్సయ్య మాట్లాడుతూ మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల సమయంలో ఎండలు తీవ్రంగా ఉంటున్నాయని, బయటకు వెళ్లే సమయంలో నలుపు రంగు దుస్తులు ధరించకూడదని సూచించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే బోర్డులను గాంధీ దవాఖానలోని ముఖ్యమైన ప్రదేశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. చర్మవ్యాధుల విభాగం హెచ్ఓడీ డాక్టర్ నర్సింహారావు నేత, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, సెక్యూరిటీ అధికారి శివాజీ, పలువురు వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన ర్యాలీ ప్రారంభించిన గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

ఉత్సాహంగా హెరిటేజ్ వాక్

ప్రపంచ హెరిటేజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. బల్దియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన హెరిటేజ్ వాక్ ఉత్సాహంగా సాగింది. దారుల్‌షిఫా నుంచి ప్రారంభమైన ఈ వాక్ సాలార్‌జంగ్ మ్యూజియం మీదుగా ఉస్మానియా ఆస్పత్రి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా కమిషనర్ రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ నగరంలో ప్రాముఖ్యమున్న వారసత్వ సంపదను కాపాడేందుకు విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. వారసత్వ సంపదను భావితరాలకు అందించాలనే సంకల్పంతో చార్మినార్ పెడస్ట్రియిన్ ప్రాజెక్టు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.18.33 కోట్ల వ్యయంతో మోజంజాహి మార్కెట్, మౌలాలి కమన్, క్లాక్ టవర్ పనులు పూర్తి చేశామన్నారు. చార్మినార్ చుట్టూ ఉన్న కమన్ల పునఃనిర్మాణ పనులకు ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ వాక్‌లో జోనల్ కమిషనర్లు రవి కిరణ్, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, వెంకన్న, పంకజ, అడిషనల్ కమిషనర్ శ్రీవాత్సవ, చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. *– సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ)*

నేరనియంత్రణకు చర్యలు తీసుకోవాలి

రాచకొండ సీపీ తరుణ్ జోషి

కీసర, ఏప్రిల్ 18: పోలీసుస్టేషన్ పరిధిలో జరిగే నేరాలను అదుపు చేయాలని, నేరనియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. కీసర పోలీసుస్టేషన్‌లో గురువారం ఆయన స్టేషన్ అధికారులతో క్రైమ్‌పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కీసర పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పెండింగ్ కేసుల విచారణ, ఇతర కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసులంతా స్నేహపూర్వకంగా వ్యవహరించాలని కోరారు. ఫిర్యాదుదారుల బాధలను ఓపికగా విని, వారికి తగిన న్యాయం చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీ పద్మజ, ఏసీపీ నరేందర్‌గౌడ్, కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యతో పాటు ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీసీఎంబీలో జిజ్ఞాస సదస్సు

సిటీబ్యూరో, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీలో శుక్రవారం జిజ్ఞాస కార్యక్రమంలో టెక్నికల్ చర్చాగోష్ఠి నిర్వహించనున్నారు. సీసీఎంబీలో జరిగే ఈ సదస్సులో బయాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై ప్రసంగించనున్నారు. వర్చువల్ వేదిక ద్వారా నిర్వహించే ఈ సదస్సులో సీసీఎంబీకి చెందిన పరిశోధకులు డా.దివ్య తేజ్ సొపాటి బిగ్ డేటా అండ్ పాండమిక్ ప్రివెన్షన్ అంశంపై చర్చించనున్నారు. ఫ్యూచరిస్ట్ ఫ్లై డేస్ పేరిట సీఎస్ఐఆర్ జిజ్ఞాస ప్రతి శుక్రవారం శాస్త్ర, సాంకేతిక అంశాలపై చర్చాగోష్ఠి నిర్వహిస్తున్నది. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సదస్సులో పాల్గొనేందుకు ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులని వెల్లడించారు.

బీబీఏ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 18 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ (అనలిటిక్స్) పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ అనలిటిక్స్ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు జూన్ 7వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నప్పటికీ, పరీక్షలను నిర్వహించే తేదీలలో మార్పులు చేసినట్లు చెప్పారు.

పీజీ డిప్లామా ఇన్ లా కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ పీజీ డిప్లామా ఇన్ లా కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేశా రు. ఈ కోర్సుల మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంబీఏ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంబీఏ (సీబీసీఎస్) మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. పూర్తి వివరాలు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థుల ఘర్షణ

కేసులు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు

కొండాపూర్, ఏప్రిల్ 18 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) లో రెండు విద్యార్థి సంఘాల మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. రెండు విద్యార్థి సంఘాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో వర్సిటీని ఉద్రిక్తంగా మార్చింది. అర్ధరాత్రి విద్యార్థి సంఘాల మధ్య చోటు చేసుకున్న ఈ వివాదంతో వర్సిటీలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని రెండు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని జే హాస్టల్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వర్సిటీకి చెందిన రెండు విద్యార్థి సంఘాలకు చెందిన విద్యార్థులు ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడ్డారు. నినాదాల కారణంగా ఏర్పడిన వివాదం.. చిలికి చిలికి గాలివానగా మారి ఘర్షణకు దారి తీసింది. తమపై అకారణంగా దాడి చేశారని ఓ సంఘానికి చెందిన బాలకృష్ణ, మరో విద్యార్థి సంఘానికి చెందిన హఫీజ్ ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు.. రెండు వర్గాల వారిపై కేసులు నమోదు చేసి, వర్సిటీలో భద్రతను పెంచారు. రెండు సంఘాల విద్యార్థులు తమపై దాడి జరిగిందంటూ.. సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుని ఆందోళనకు పిలుపునివ్వడంతో వర్సిటీ ఉద్రిక్తంగా మారింది.

అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ వివాదంతో వర్సిటీలోని మిగతా విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసి భద్రతను పెంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా విద్యార్థులను చెదరగొట్టారు. వర్సిటీలో ఎలాంటి ఆందోళనలు చేపట్టరాదని, బయటి వ్యక్తులను లోనికి అనుమతి ఇవ్వడంలేదు. మాదాపూర్ డీసీపీ వినీత్ ఆధ్వర్యంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

నాన్న.. తాగుడు మానేయండి

- పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యా యత్నం
- సెల్ఫీ వీడియో తీసి స్నేహితుడికి పంపి స్విచ్ఛాఫ్ చేసిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

షాద్‌నగర్, ఏప్రిల్18: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామంలో గురువారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బుడ్డనొళ్ల రాజు అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఈ విషయమై మనస్తాపం చెంది గుర్తు తెలియని చోట కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఉదంతాన్ని తన ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసి తన మిత్రుడికి పంపి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు రాజు కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు, పోలీసులు రాజు ఆచూకి కోసం ప్రయత్నిస్తున్నారు. ఇదిఇలా ఉంటే రాజు పంపిన సెల్ఫీ వీడియోలో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. తనను పనికిరాని వాడినంటున్నావని కన్నీరు పెట్టుకున్నాడు. తన వలన కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయాడని, ఫలితంగా జరిమానాతో పాటు బాధితుల తిట్లు ఓ వైపు, మీ తిట్లు ఓ వైపు ఉండడంతో బాధగా ఉందని వాపోయాడు. తన ఆవేదనను పట్టించుకోవడం లేదని వీడియోలో తెలిపాడు. చివరకు నాన్న మీరు ఇప్పటికైనా తాగుడు మానేయండి.. అని వేడుకున్నాడు. ఈ సెల్ఫీ వీడియో స్థానికంగా వైరల్‌గా మారింది.

ప్రచార వాహనాలు ప్రారంభం

వికారాబాద్, ఏప్రిల్ 18 : చేవెళ్ల బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఎన్నికల ప్రచార వాహనాలను గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తన నివాసం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ రమణ, పీఏసీఎస్ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, నాయకులు మల్లేశం, బాబు చౌహాన్, శీను, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..



కొడంగల్, ఏప్రిల్ 18: నియోజకవర్గంలోని కోస్గి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శిరీషా రాజేశ్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు.

తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా..

ఐనాన్‌పల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 18: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు ఐనాన్‌పల్లి గ్రామంలో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్డు, దేవాలయ అభివృద్ధి గురించి చైర్మన్ దృష్టికి తీసుకురాగా ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, వైస్ ప్రెసిడెంట్ యాదిరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు.

వికారాబాద్, ఏప్రిల్ 18 : అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని వికారాబాద్ అగ్నిమాపక అధికారి ఎన్.వెంకటరమణారెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా గురువారం వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేటలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారాల్లో పనిచేసే సిబ్బంది పాటించాల్సిన నివారణ చర్యలపై వివరించారు. కర్మాగారాల్లో పరికరాలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యా యత్నం

పరిగి, ఏప్రిల్ 18 : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద జరిగింది. ఎస్ఐ సంతోష్ అందించిన వివరాల ప్రకారం పరిగి మండలం యాబాజీగూడకు చెందిన రాజ్‌కుమార్, ఖుదావంద్‌పూర్ గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. రాజ్‌కుమార్ ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా యువతి కుట్టు శిక్షణ కోసం పరిగికి వస్తున్న క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. వీరి వివాహానికి యువతి కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో యువకుడికి ఇటీవల మరో అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. ఇదిలావుండగా తనను ప్రేమించి, పెండ్లి చేసుకోకుండా మోసం చేశాడని రాజ్‌కుమార్‌పై గురువారం ఉదయం యువతి పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.దీంతో రాజ్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా పోలీసులు పిలువగా అతను పురుగులమందు తాగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే రాజ్‌మమార్‌ను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం వికారాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు.

నాపరాతి గని గుంతలో పడి వ్యక్తి మృతి

తాండూరు రూరల్, ఏప్రిల్ 18: నాపరాతి గని గుంతలో పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.....తాండూరు మండలం, మల్కాపూర్ గ్రామానికి చెందిన అక్కంపల్లి అంజలప్ప (36) జులాయిగా తిరుగుతుండేవాడు. ఇంట్లో వారు ఏదైనా పని చేసుకోవచ్చుగా అంటూ మందలించారు. రోజు తనను పని చేయాలని వేధిస్తారా, చనిపోతానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని ఓ నాపరాతి గని గుంత సమీపంలో బట్టలు, చెప్పులు ఉంచి నీట మునిగి చనిపోయాడు. పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

హనుమాన్ జయంతి వేడుకలపై పోలీస్ ఫోకస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): శ్రీరామ నవమి శోభాయాత్ర నగరంలో ప్రశాంతంగా పూర్తికావడంతో.. ఇప్పుడు ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు హనుమాన్ జయంతి వేడుకలపై దృష్టి పెట్టారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ప్రారంభమై, సికింద్రాబాద్‌లో ముగుస్తుంది. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లలోని కాలనీల నుంచి ర్యాలీలు ప్రధాన ర్యాలీకి కలుస్తుంటాయి. ఒకపక్క పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. మరోపక్క హనుమాన్ జయంతి ర్యాలీలు కూడా ఉండటంతో అందుకు తగ్గట్టుగా క్షేత్రస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులు దృష్టి సారించారు.